క్లుప్తంగా

గణేష్ మండపానికి కర్ర పూజ..



పూజ చేస్తున్న ఏడీఈ వేణు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో రెండో ఏడాది ఏర్పాటు చేయనున్న వినాయకుడి విగ్రహానికి సంబంధించిన కర్రపూజను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ భద్రాచలం ఏడీఈ వేణు ఘనంగా పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం విద్యుత్ శాఖ ఏఈ రాజారావు, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న గౌడ కులస్తులు

దమ్మపేట: అశ్వారావుపేట ఆయిల్‌పాం డివిజనల్ మేనేజర్ నాయుడు రాధాకృష్ణను, గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. మండలంలోని నాగుపల్లి గ్రామానికి చెందిన రాధాకృష్ణ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసాపత్రంను అందుకున్నందుకు సత్కరించారు. కందిమళ్ల లక్ష్మీనారాయణ, సర్వేశ్వర రావు, శోభనాచలం, కందిమళ్ల రామారావు, కేవీ, నాగప్రసాద్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వైద్యశిబిరం



వంటశాలను పరిశీలిస్తున్న సుభాష్

దుమ్ముగూడెం: మండలంలోని సీతారాంపురం గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో సోమవారం డాక్టర్ సుభాష్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలను పరిశీలించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చర్మ సమస్యలు రాకుండా ఉండడానికి పాటించాల్సిన జాగ్రత్తలు సూచించారు. వంటశాల, వాటర్ ట్యాంక్ పరిశీలించి జాగ్రత్తలు పాటించాలని వైస్ ప్రిన్సిపాల్, సిబ్బందికి సూచించారు.

క్రీడాకారుడికి అభినందనలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో సిటీ స్టైల్ క్రీడాకారుడు శంకర్‌రావును కూకట్‌పల్లి ఫస్ట్‌క్లాస్ జడ్జి మండా వెంకటేశ్వరరావు సోమవారం అభినందించారు. జాతీయస్థాయి మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాలుగు బంగారు పతకాలు సాధించిన శంకర్రావును సత్కరించారు. జిమ్ కోచ్ రామిరెడ్డి, శివరామకృష్ణ ప్రసాద్, శోభానాయక్, వెంకటకృష్ణ ఉన్నారు.

'మా గోడు పట్టించుకునేదెవరు?'



ఇసుకవాగు వద్ద మాట్లాడుతున్న స్థానికులు

అశ్వాపురం: మండల పరిధిలోని ఎలకలగూడెంలో ఇసుకవాగు పొంగి రాకపోకలు స్తంభించి గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని ఎన్నో ఏళ్లుగా ఈ కష్టాలు పడుతున్నా మా గోడు ఎవరు పట్టించుకోవడం లేదని మాజీ సర్పంచ్ కలేటి నర్సింహారావు, గ్రామస్తులు అన్నారు. ఈ మేరకు సోమవారం ఎలకలగూడెంలో ఇసుకవాగు వద్ద స్థానికులతో కలిసి ఆయన మాట్లాడారు. అత్యవసర పరిస్థితిలో ఈ వాగు దాటి వెళ్లాలని వర్షాకాలంలో వాగు దాటలేక ఇబ్బందులు పడుతున్నామని, వంతెన నిర్మించి కష్టాలు తీర్చాలని కోరారు. రమేష్, నారాయణ, గోపాలరావు, శ్రీను, సాంబశివరాజు, సర్వేష్, విజయ్, శివాజీ, జశ్వంత్ ఉన్నారు.

మండలంలో జోరు వర్షం



చెరువును తలపిస్తున్న పంటపొలాలు

కరకగూడెం: మండల వ్యాప్తంగా సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వరద నీరు చెరువులకు చేరడంతో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. వాగులు సైతం పొంగి పొర్లాయి.

కోట్లు వెచ్చించారు.. ఆపేశారు

అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ షెడ్ల నిర్మాణం

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..
- సిమెంట్ బస్తాలు దాస్తున్న వైనం
- పనులు పూర్తి కాకముందే బీటలువారుతున్న గోడలు



అసంపూర్తిగా దర్శనమిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్

మణుగూరు రూరల్: కూరగాయలు, ఆకుకూరలు, మాంసం ఉత్పత్తులన్నింటిని ప్రజలకు ఒకే చోట అందించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ హయాంలో అప్పటి ఎమ్మెల్యే రేగా కాంతారావు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేయించి నిధులు రాబట్టి పనులకు శ్రీకారం చుట్టారు. మార్కెట్ నిర్మాణ పనులను సైతం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులకు సూచనలు ఇస్తూ తుది దశకు చేర్చారు. ముగింపు పనులు నిధులు అవసరమవడంతో ఆ నిధులను సైతం మంజూరు చేయించారు. ఈలోగా ఎన్నికల రావడంతో పనులకు బ్రేక్ పడింది. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానికంగా గెలిచిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వ పథకాల అమలు వైపు దృష్టి సారిస్తున్నారు తప్ప గతంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల వైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఊసును సైతం లేవనెత్తకపోవడంతో మార్కెట్ ముగింపునకు చేరుకోవడం లేదు.

కన్నెత్తైనా చూడని అధికారులు..

వ్యాపారాలు, వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అన్నింటిని ప్రజలకు ఒకే చోట అందించాలని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించి సుమారు రూ.4.50 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో



బీటలు వారుతున్న గోడలు

మండలంలోని సమితిసింగారం పంచాయతీ రాజీవ్ గాంధీనగర్ వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో మార్కెట్ భవన నిర్మాణానికి 2021 జూలైలో శ్రీకారం చుట్టారు. నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించటంతో రెండున్నరేళ్లకు నిర్మాణం తుది దశకు చేరుకుంది. కానీ 18 నెలలుగా అసంపూర్తి మార్కెట్ భవన నిర్మాణంపై కనీసం కన్నెత్తి చూడకపోవడంతో గోడలు బీటలు బారుతుండగా భవనంలోని షెట్టర్లను కొందరు సిమెంట్ బస్తాలు దాచుకునే గోదాంలుగా మార్చారు. భవన నిర్మాణంతో పట్టణ వ్యాపారులకు మేలు జరగడం, ట్రాఫిక్ అంతరాయం తొలగిపోవడం మాట దేవుడెరుగు అసంపూర్తి నిర్మాణంతో కోట్లాది రూపాయల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరేనా అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. మార్కెట్ నిర్మాణంపై స్థానిక ఎమ్మెల్యే పాయం చూపాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణంపై దృష్టి సారించి పూర్తయ్యేలా తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గంజాయి, మందుబాబులకు అడ్డా..



కోట్లాది రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన మార్కెట్ నిర్మాణం నిధుల కొరతతో అసంపూర్తిగా దర్శనమిస్తోంది. పనులు ఆగిపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రయితే చాలు ఆకతాయిలు మద్యం, గంజాయి సేవించేందుకు అడ్డాగా మారుతుంది. గంజాయి మత్తులో ఆకతాయిలు వికృత చేష్టలకు పాల్పడుతున్నట్లుగా మార్కెట్ ప్రాంతాన్ని చూస్తే అర్థమవుతోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులెవ్వరు కన్నెత్తి చూడకపోవడంతో ఆకతాయిల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది.





గంజాయి సేవించేందుకు వినియోగించిన బాటిళ్లు

పోలీస్ వారు సైతం ఆ ప్రాంతం పెట్రోలింగ్ నిర్వహించకపోవడంతో మత్తు బాబుల ఇష్టారాజ్యం అవుతోంది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన మార్కెట్ ప్రాంతంపై అధికారులు దృష్టి సారించి ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేసి రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



మణుగూరు టౌన్: మాట్లాడుతున్న డీఎస్పీ రవీంద్రరెడ్డి

మణుగూరు టౌన్: గణేశ్ మండపాల నిర్వాహకులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుకు అనుమతి పొంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిబంధనలు పాటించాలని డీఎస్పీ రవీంద్రరెడ్డి అన్నారు. సోమవారం గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆన్‌లైన్‌లో అనుమతి పొందిన తర్వాతే మండపాలను ఏర్పాటు చేసుకోవాలని, ప్రతీ ఒక్కరూ మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతీ మండపం వద్ద సీసీ కెమెరా ఉంచాలని నిర్దేశించిన సమయానికి నిమజ్జనం పూర్తి చేయాలన్నారు. గణేశ్ మండపాలు ప్రజారవాణాకు, ఎమర్జెన్సీ వాహనాలకు ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండప ఏర్పాటు స్థల యజమాని అనుమతి తీసుకోవడంతో పాటు నిర్వాహణ కమిటీల వివరాలు నంబర్లు ఏర్పాటు చేయాలన్నారు. రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లు వినియోగించాలన్నారు. శోభాయాత్ర సమయాల్లో ఎట్టి పరిస్థితుల్లో డీజేలను ఏర్పాటుకు అనుమతి లేదన్నారు. మండపాల వద్ద పేకాట, మద్యం సేవించడం అసభ్యకరమైన ప్రసంగాలు పాటలుపూర్తి నిషేధించాలన్నారు. ఈ సమావేశంలో సీఐ పాటి నాగబాబు, ఎస్సై రంజిత్ సిబ్బంది ఉన్నారు.

మండపాలకు అనుమతులు తప్పనిసరి



బూర్గంపాడు: కమిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న సీఐ నాగరాజు

బూర్గంపాడు: గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణేష్ మండపాలకు పోలీస్‌శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఇన్‌చార్జ్ సీఐ నాగరాజు అన్నారు. బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం గణపతి ఉత్సవ కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్లపై మండపాలు వేసి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగించొద్దని, మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగిన ఉత్సవ కమిటీ ప్రతినిధులు బాధ్యులవుతారని హెచ్చరించారు. బూర్గంపాడు ఎస్సైలు మేడ ప్రసాద్, దేవ్‌సింగ్ పాల్గొన్నారు.

దమ్మపేట: గణేష్ మండపాలు ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు తప్పనిసరిగా నియమ నిబంధనలు పాటించాలని దమ్మపేట ఎస్సై సాయికిషోర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా మండపాల అనుమతి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బాధ్యత తీసుకోవాలన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి



మొక్క నాటుతున్న డీఎస్పీ సతీష్

ములకలపల్లి: పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని పాల్వంచ డీఎస్పీ సతీష్ ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులపై మర్యాదగా ప్రవర్తించాలన్నారు. అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సై ఎస్.మధుప్రసాద్, ఏఎస్సై పుల్లారావు, సిబ్బంది ఉన్నారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి



మణుగూరురూరల్: బారికేడ్లు ఏర్పాటుచేస్తున్న అధికారులు



అశ్వాపురం: గొందిగూడెం కొత్తూరులో..

అశ్వాపురం: మండలంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ అశోక్‌రెడ్డి, ఎంపీడీఓ రవీంద్రప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని గొందిగూడెం కొత్తూరు–ఎలకలగూడెం గ్రామాల మధ్య ఇసుకవాగు పొంగి ప్రవహించి ఎలకలగూడెం, వేములూరు, మనుబోతులగూడెం గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. దీంతో సోమవారం సీఐ అశోక్‌రెడ్డి, ఎంపీడీఓ రవీంద్రప్రసాద్ వాగు ఉధృతిని పరిశీలించారు. స్థానిక గిరిజనులతో మాట్లాడి వాగు దాటే ప్రయత్నం చేయవద్దన్నారు.

మణుగూరు రూరల్ : వరదలపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అద్దంకి నరేష్ అన్నారు. మండల పరిధిలోని రామానుజవరం–పగిడేరు వెళ్లే మార్గంలో రోడ్డుపై వరద పొంగి ప్రవహిస్తుండడంతో తహసీల్దార్ అద్దంకి నరేష్, సీఐ పాటి నాగబాబు, ఎస్సై రంజిత్, ఆర్ఐ గోపిలు బారికేడ్లు ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టారు. చేపల వేటకు వెళ్లొద్దని, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, చెరువులను దాటొద్దన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

చండ్రుగొండ : సీఎం మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో ఇక్కడ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలానికి జూనియర్, డిగ్రీ కళాశాలలు మంజూరు చేయాలని, సీతారామ కాలువను అనుసంధానం చేస్తూ చెరువుల్లో గోదావరి జలాలను నింపాలన్నారు. పెద్దిని వేణు, ఆర్.వెంకటాచారి, రాయి రాజా, విప్పర్ల వెంకటేశ్వర్లు, మిరియాల మోహన్‌రావు, ఎస్కే.నాగుల్ మీరా, శ్రీను, రాజా పాల్గొన్నారు.

నిందితులపై చర్య తీసుకోవాలి

అశ్వాపురం: మీసేవ కమిషనర్ రవికిరణ్‌పై బెదిరింపులు, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో మీసేవ నిర్వాహకులపై దౌర్జన్యం చేయడాన్ని నిరసిస్తూ మండలంలో సోమవారం మీసేవ నిర్వాహకులు, ఆపరేటర్లు నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మీ సేవ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ.. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులకు శిక్షణ

దమ్మపేట: మండల పరిధిలోని దుర్గం గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలో ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్ సంస్థ ఆధ్వర్యంలో కె.లక్ష్మారెడ్డి ఆర్థిక సౌజన్యం, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సహకారంతో విద్యార్థులకు ప్రేరణాత్మక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపన్యాసకులు శ్రీరామ్, సుధాకర్, వరుణ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏటీడీఓ చంద్రమోహన్, హెచ్ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండురోజుల్లో నాలుగు సాధారణ ప్రసవాలు



బాలింతలతో వైద్యులు

చర్ల: మండలంలోని సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాలలో రెండు రోజుల్లో వైద్యులు డాక్టర్ దివ్యనయన, డాక్టర్ నగేష్‌లు నాలుగు సాధారణ ప్రసవాలు చేశారు. గతంలో ప్రసవాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడంలో సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాలకు మంచి పేరు ప్రతిష్టలు ఉండగా మళ్లీ అదే వైభవాన్ని సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చి ప్రభుత్వ వైద్యశాలపై ప్రజల్లో నమ్మకాన్ని నింపాలని స్థానికులు కోరుతున్నారు.

రేపు వాహనాల వేలం

మణుగూరు రూరల్: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మణుగూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో రేపు(బుధవారం) వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్‌శాఖ సీఐ ఆర్ రాజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాటుసారా కేసుల్లో పట్టుబడిన వాహనాలను శాఖా కార్యాలయంలో రేపు ఉదయం 10 గంటల నుండి వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

మణుగూరు రూరల్: మండలంలోని సమితిసింగారం పంచాయతీ ఉడతానేని గుంపు ప్రాంతంలో సర్వే నంబర్ 138లో గల 28 ఎకరాల ప్రభుత్వ భూమిలో తహసీల్దార్ అద్దంకి నరేష్ సోమవారం హెచ్చరిక బోర్డ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ ప్రభుత్వ భూమిని ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి కేటాయించినట్టు తెలిపారు. భూమి సీసీ కెమెరాలో పర్యవేక్షణలో ఉందని, భూమిని ఎవరైనా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గోపి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు ఇవ్వాలి

కరకగూడెం: ఇళ్లు లేని నిరుపేద దళితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంలో అధికారులు నిరాకరిస్తున్నారని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి మండల కన్వీనర్ కీసరి దుర్గారావు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం చొప్పాల గ్రామంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయినా నిజమైన పేదలకు ఇళ్లు రాకపోగా, ఇళ్లు ఉన్నవారికే మంజూరవుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలన్నారు.

రేపు అస్థిత్వ ఉద్యమ ఆవిర్భావ సభ

అశ్వాపురం: ఈనెల 20న హైదరాబాద్ బషీరాబాగ్ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి నాయకత్వంలో పానీపూరి గోబ్యాక్ నినాదంతో నిర్వహించనున్న తెలంగాణ అస్తిత్వ ఉద్యమ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు అశ్వాపురంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బరితెగించి దాడులకు దిగుతున్న మార్వాడీల పెత్తనాన్ని ప్రశ్నిస్తూ జరుగుతున్న ఈ సభను విజయవంతం చేయాలన్నారు.

కబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బూర్గంపాడు: మండలకేంద్రంలోని ప్రభుత్వ పశువైద్యశాల ముందు ఆర్అండ్‌బీ స్థలం కబ్జా చేసి అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు సోమవారం తహసీల్దార్ కేఆర్‌కేవీ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. పశువైద్యశాలకు వెళ్లేందుకు వీలులేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిని వెంటనే నిలువరించాలని వారు కోరారు. కబ్జాలు, అక్రమ నిర్మాణాలపై అధికారులు దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

దొరికిన ఫోన్ అప్పగింత

భద్రాచలంఅర్బన్: గోదావరి నది ఒడ్డున సోమవారం గజఈతగాడు ప్రసాద్‌కు ఓ సెల్‌ఫోన్ దొరికింది. ఆఫోన్ కోసం ఎవరూ పోలీస్‌స్టేషన్‌లో ఫోన్‌ను అప్పగించాడు.

ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన పోరాటాలను కొనియాడారు.

–సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్: నివాళులర్పిస్తున్న గౌడ సంఘం బాధ్యులు




గుండాలలో..

బెండాలపాడుకు నూతన శోభ

- సీఎం పర్యటన ఖరారు కావడంతో అభివృద్ధి
- రోడ్ల మరమ్మతులు, పారిశుద్ధ్యం, విద్యుత్ లైన్ల పనులు చకచకా



ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



బెండాలపాడు గ్రామం వ్యూ

చండ్రుగొండ: మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన బెండాలపాడులో నూతనశోభ సంతరించుకుంటుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ గ్రామానికి వచ్చేందుకు ప్రత్యేకంగా ఎంచుకోవడంతో గ్రామంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఇక్కడే మకాం వేసి పనులు పర్యవేక్షిస్తున్నారు. మండలకేంద్రం నుంచి గ్రామానికి వెళ్లే బీటీరోడ్డుతోపాటు గ్రామంలోని అంతర్గత రోడ్లకు మహర్దశ పట్టింది. ప్రతీ పనిని శరవేగంగా చేయిస్తున్నారు. మండలకేంద్రంకు బెండాలపాడు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఒక్కప్పుడు గ్రామానికి వెళ్లేదుకు దారి సైతం సక్రమంగా లేదు. వాహనాలు పక్కన పెడితే నడక కూడ భారంగా ఉండేది. గ్రామానికి ఆనుకుని చారిత్రాత్మకమైన కనకగిరి గుట్టలున్నాయి. అటవీ ఉత్పత్తులతోపాటు వ్యవసాయం చేసుకుంటూ ఇక్కడి ఆదివాసీలు జీవనం సాగిస్తారు. కాలానుగుణంగా ఈ గిరిజన గ్రామం అభివృద్ధి వైపు అడుగు వేసింది. గ్రామంలో పల్లెరు వీరభద్రం స్వచ్ఛందసంస్థ ఏర్పాటు చేసి బ్యాంబోక్లస్టర్ పరిశ్రమ ఏర్పాటు చేశారు. క్లస్టర్‌పై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్ వెదురు ఉత్పత్తులు మార్కెటింగ్‌కు ప్రోత్సహిస్తున్నారు. కాకతీయుల కట్టడాలు, ఆహ్లాదపరిచే ప్రకృతి సౌందర్యం ఉన్న కనకగిరి గుట్టలను సైతం పర్యాటకకేంద్రం పనులు సైతం ఇటీవలకాలంగా సాగుతున్నాయి.

ఇళ్ల నిర్మాణాలతో తెరకెక్కి..

మారుమూల గిరిజన గ్రామమైన బెండాలపాడును ఆదర్శ గ్రామంగా ఎంచుకున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ 310 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. గ్రామంపై ప్రత్యేక దృష్టి పెట్టి మరీ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇళ్ల ప్రారంభోత్సవాలకు మొగ్గు చూపారు. ఈ మేరకు ఈనెల 21న సీఎం రేవంత్‌రెడ్డి గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించనున్నారు.

జీవితంలో మర్చిపోలేం..



ఇంటి గృహప్రవేశానికి సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నారని అధికారులు చెప్పారు. సీఎం మా ఇంటికి వస్తున్నారంటే నమ్మలేక పోతున్నాం. సొంతింటి కల సాకారం అవుతుంటే గృహప్రవేశానికి సీఎం రావడం జీవితంలో మర్చిపోలేం.

– బచ్చల రమణ, లబ్ధిదారురాలు, బెండాలపాడు

కూలీ చేసుకుంటూ బతుకుతాం..



మా స్వంతంగా ఇల్లు కట్టుకోలేని పరిస్థితి. ప్రభుత్వం మాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం సంతోషంగా ఉంది. మా ఇంటి నిర్మాణ పనులు వేగంగా నడుస్తున్నాయి.

– కణితి సీతారత్నం, పుల్లయ్య, లబ్ధిదారులు, బెండాలపాడు

గ్రామానికి మహర్దశ పట్టింది



ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో గ్రామానికి మహర్దశ పట్టింది. ఇళ్ల నిర్మాణాలతో పండుగ వాతావరణం నెలకొంది. పేదల కళ్లల్లో ఆనందం కన్పిస్తుంది. ప్రభుత్వానికి మా గ్రామం రుణపడి ఉంటుంది.

– బొర్రా సురేష్, దిశ కమిటీ సభ్యుడు, బెండాలపాడు